క్లుప్తంగా

భీమవరం సబ్‌జైలు తనిఖీ



సబ్‌జైలును తనిఖీ చేస్తున్న జడ్జి సురేష్‌బాబు

భీమవరం: పట్టణంలోని ప్రత్యేక ఉప కారాగారాన్ని భీమవరం ఒకటవ అదనపు సివిల్ జడ్జి జి సురేష్‌బాబు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిమాండ్ ముద్దాయిల కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంటశాల, ఆహార పదార్థాలు, జైల్ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్జి సురేష్‌బాబు మాట్లాడుతూ ఖైదీలు క్రమశిక్షణ కలిగి సత్ప్రవర్తనతో ఉండాలని, నేర ప్రవృత్తిని విడనాడి సమాజంలో మంచి వ్యక్తిగా గుర్తింపు పొందే విధంగా ప్రతి ఒక్కరిలో పరివర్తన రావాలన్నారు. ఉచిత న్యాయ సహాయాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జైలు విజిటింగ్ లాయర్ బి.లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మానసిక సమస్యలపై అవగాహన



ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు ఎస్ సునీల్ ఆధ్వర్యంలో శనివారం మానసిక సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భీమవరం ఏరియా ఆసుపత్రి మానసిక వైద్య నిపుణుడు శంకర్ హాజరై పలు సూచనలు చేశారు. ప్రతినెలా ఒకరోజు ప్రభుత్వ ఆసుపత్రికి విచ్చేసి వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానసిక సమస్యల గురించి వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ



వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: సర్వమత సమ్మేళనమే ప్రపంచ శాంతని తోటి వారుకష్టాల్లో ఉన్నప్పుడు అదుకోవడం భగవత్ సేవవంటిదని సెయింట్ మేరీస్ ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సిస్టర్ యానీస్ అన్నారు. ఈస్టర్ పండుగను పురస్కరించుకుని శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో శనివారం సెయింట్ మేరీస్ ఆస్పత్రి సహకారంతో కృష్ణదేవరాయ కల్యాణ మండపంలో 50 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో యానీస్ మాట్లాడుతూ పేదలకు పండుగలకు నూతన వస్త్రాలు, నిత్యావసర వస్తువులు అందజేస్తున్నామన్నారు. దానిలో భాగంగా ఈస్టర్ పండుగ సందర్భంగా బ్యాంక్ కాలనీలోని ఉచితంగా చీరలు అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి చీఫ్ సిస్టర్ సేలీన్, చెరుకువాడ రంగసాయి, యాదవ సంఘం నాయకుడు కొండ్రు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య

పాలకోడేరు: మండలంలోని గొరగనముడి, విస్సాకోడేరు, పెన్నాడ, శృంగవృక్షం గ్రామాల్లో జిల్లా జాయింట్ కలెక్టర్, ఉండి ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీవీ ప్రవీణ్ ఆదిత్య సంబంధిత సెక్టార్ అధికారులు, ఏఈఆర్‌ఓలతో కలిసి శనివారం వివిధ పోలింగ్ కేంద్రాలను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో శాంతియుతంగా ఎక్కువ శాతం పోలింగ్ జరిగేలా 'స్వీప్' ద్వారా అవగాహనా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య అధికారులను ఆదేశించారు.

పరిసరాల శుభ్రత.. అందరి బాధ్యత

ఆకివీడు: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రిన్సిపాల్ కె.సుజాత చెప్పారు. మండలంలోని దుంపగడప వీవీగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా శనివారం బోసుకాలనీలో రోడ్లను శుభ్రపరచారు. ఈ సందర్భంగా ఆమె గ్రామస్తులనుద్దేశించి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత మన ఆరోగ్యానికి మూలకారణంగా ఉంటుందన్నారు. పరిసరాలు అపారిశుధ్యంతో పేరుకుపోతే వ్యాధులు విజృంభించే ప్రమాదముందన్నారు. వ్యర్థాల్ని రోడ్లపై పారబోయకుండా చెత్త బండ్లకు అందజేయాలని ఆమె సూచించారు. సేవా విభాగం పీఓ డాక్టర్ కె.ఆనంద్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రగతి పథం.. అభివృద్ధే ధ్యేయం

- ఉండి డివిజన్లలో సమస్యలకు మోక్షం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



సుందరంగా విలేజ్ క్లినిక్ భవనం

ఆకివీడు: గ్రామాల్లో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. గత ప్రభుత్వాల్లో ఎన్నడూ జరగని అభివృద్ధి గత మూడేళ్ల పాలనలో జరుగుతుందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థతో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయి. ప్రతి గ్రామంలో గత ఐదేళ్లుగా రూ.2నుంచి 16కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు పూర్తి చేశారు. ఇదేళ్ల గ్రామాల పరిస్థితి, ఇప్పటి గ్రామాల పరిస్థితిని చూసి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ భవనాలను నిర్మాణం చేసి ప్రతి గ్రామ సచివాలయంలో 11మంది ఉద్యోగులను నియమించి పరిపాలనను పల్లె ప్రజలు చేరువలోకి తీసుకువచ్చి సత్వర సేవలు అందిస్తున్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేయడంతో గ్రామాలు మినీ సెక్రటరేట్లుగా ఉన్నాయి. గతంలో కుల, ఆదాయ, ఇతర ధ్రువీకరణ పత్రాలు కావాలంటే దూర ప్రాంతంలోని మండల కేంద్రాల్లో గల తహసీల్దార్ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాలకు వెళ్లవలసి వచ్చేది. అదీ కూడా నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగవలసి వచ్చేది. దీనితో ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారు. గ్రామ సచివాలయ వ్యవస్థ రావడంతో గంట వ్యవధిలోనే సొంత ఊరులోనే ధ్రువీకరణ పత్రాలు, సంక్షేమ పథకాలను అందుకుంటున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి వైద్యాన్ని ప్రజల ముంగిటకు తీసుకువచ్చి వైద్యులను అందుబాటులో ఉంచారు. రైతు భరోసా ద్వారా వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహిస్తోంది. నాడు-నేడులో పాఠశాలలు సుందరంగా రూపుదిద్దుకున్నాయి. పల్లెల్లోని అధిక శాతం వీధులన్నీ సీసీ రోడ్లుగా మారిపోతున్నాయి. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు హయాంలో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుంది. మండలంలోని కొల్లేరు తీరంలోని సిద్ధాపురం గ్రామం గత ఐదేళ్లలో ఆదర్శ గ్రామంగా తయారైంది. గ్రామంలో 4,800 మంది జనాభా ఉన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు గత ఐదేళ్లలో 6,26,03,314లు ప్రజలకు అందాయి. రూ. 4.03 కోట్ల వ్యయంతో రహదారుల అభివృద్ధి జరిగింది. అన్ని సౌకర్యాలతో సిద్ధాపురం గ్రామం సిరులతో తులతూగుతోంది. ప్రజలు ఆనందంగా జీవిస్తున్నారు. గ్రామంలో ఎస్సీ సర్పంచ్‌గా చిగురుపాటి చిట్టిబాబు, ఉప సర్పంచ్‌గా ఇందుకూరి నారాయణరాజు గ్రామాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు.



సిద్ధాపురంలో సీసీ రోడ్లు ఇలా..



గ్రామంలో సీసీ రోడ్లుతో డ్రెయిన్

ఆధ్యాత్మిక శోభతో..

కొల్లేరు తీరంలో సిద్ధులు ఈప్రాంతంలో సంచరించడంతో సిద్ధాపురం గ్రామంగా పేరొందింది. గ్రామంలో పురాతన కోదండ రామాలయం ఉంది. కంచి కామకోటి పీఠాధిపతుల చేతుల మీదుగా పునః నిర్మాణం జరిగింది. ప్రతి ఏటా శ్రీరామ నవమి కల్యాణోత్సవంలో కంచి నుంచి తీసుకువచ్చిన ముత్యాల తలంబ్రాలతో స్వామి వారి కల్యాణం వైభవోపేతంగా జరుగుతుంది.

గ్రామ అభివృద్ధే లక్ష్యం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మా గ్రామం బాగుపడింది. గ్రామంలో పలు అభివృద్ధి పనులు జరిగాయి. సచివాలయ భవనం, ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు ప్రారంభించుకోవడంతో గ్రామానికి మరింత కళ వచ్చింది. ఒక ప్రణాళిక ప్రకారం గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నా. ముందుముందు గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసి జిల్లాకు ఆదర్శంగా తీర్చిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నా. ప్రజాప్రతినిధులు, పాలకవర్గం, అధికారులు, గ్రామస్తుల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నా...

– చిగురుపాటి చిట్టిబాబు, సర్పంచ్, సిద్ధాపురం,ఆకివీడు మండలం

గ్రామ పాలన బాగుంది



సీఎం జగన్ వచ్చిన తరువాత గ్రామ పరిపాలన బాగుంది. గ్రామంలోనే సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. మండల కేంద్రానికి, జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా ఉంది. పథకాలు కూడా ఇంటికే వస్తున్నాయి. అధికారులు, ఏఎన్ఎంలు, డాక్టర్లు ఇంటికి వచ్చి యోగక్షేమాలు తెలుసుకుంటున్నారు. ఆరోగ్య సురక్షతో వైద్యం అందిపుచ్చుకున్నట్లుంది. ఇంతటి గొప్ప పరిపాలన ఎప్పుడూ చూడలేదు. సీఎం జగన్‌కు ధన్యవాదాలు.

– గమిడి రాజేశ్వరి, గృహిణి, సిద్ధాపురం, ఆకివీడు మండలం

మౌలిక వసతులు కల్పించాం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్.నర్సింహరాజు ప్రోత్సాహంతో రూ. 4 కోట్ల వ్యయంతో అభివృద్ధి పథకాలు పూర్తి చేశాం. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందే విధంగా కృషి చేశాం. మట్టి రోడ్లను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేశాం. జలజీవన్ మిషన్ నిధులతో శివారు గ్రామం నందమిల్లిపాడులో మంచినీటి వసతి మెరుగుపరచాం. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజారంజకపాలన కొనసాగుతోంది. ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుంది. గ్రామంలో ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారు.

– ఇందుకూరి నారాయణరాజు, ఉప సర్పంచ్, సిద్ధాపురం, ఆకివీడు మండలం

ప్రభుత్వ విప్‌ను కలిసిన ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



భీమవరంలో ప్రభుత్వ విప్ శ్రీనివాస్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న బాలకృష్ణ తదితరులు

భీమవరం: వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన పొన్నమండ బాలకృష్ణ శనివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధిశ్రీనివాస్‌ను భీమవరంలోని ఆయన క్యాంపు కార్యాయలంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ భీమవరంలో గతంలో ఎన్నడూలేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించిన శ్రీనివాస్‌కు దళితులంతా అండగా నిలబడతారన్నారు. కుల, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ఎమ్మెల్యే ఎంతో ముందుచూపుగా వ్యవహరించారని దానితో అన్నివర్గాల ప్రజల గుండెల్లో గూడుకట్టుకున్నారని కొనియాడారు. ఆయన వెంట మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటమిల్లి మంగరాజు తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం పట్టణంలోని ఎం.ఆర్.ఓ ఇండోర్ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 11 కెవి లైన్ల పై చెట్లు కొమ్మలు తొలగించుట కొరకు ఆదివారం ఉదయం 6:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పట్టణంలో పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈ.ఈ)పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ప్రకాశంచౌక్, పెదపేట, టౌన్ హాల్ రోడ్, జువ్వలపాలెం రోడ్, అంబేడ్కర్ సెంటర్, పాత బస్టాండ్ ఏరియా, సర్రాజువీధి, రెస్ట్ హౌస్ రోడ్, గంగానమ్మగుడి రోడ్, కాలువగట్టు ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ఆకివీడు: క్షయ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి రోగి సహకరించాలని లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ ఎంవీ.సూర్యనారాయణరాజు పిలుపునిచ్చారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ) వద్ద ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో 40 మంది రోగులకు నిత్యవసర వస్తువులు, పౌష్టికాహారం, పండ్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సూర్యనారాయణరాజు మాట్లాడుతూ క్షయ రహిత సమాజం ఏర్పడటానికి అందరూ కలిసి సమైక్యంగా ఎదుర్కోవాలన్నారు. పోలియో రహిత సమాజం ఏర్పడేందుకు ముందుగా ఆకివీడు పట్టణం, మండలంలో లయన్స్‌క్లబ్ 30 ఏళ్ల క్రితం కృషి చేసిందన్నారు. ఇదే విధానాన్ని ప్రభుత్వం దేశవ్యాప్తంగా పోలియో రహిత సమాజం కోసం క్యాంపులు నిర్వహించి, ఏటా రెండు పర్యాయాలు పోలియో చుక్కలు చిన్నారులకు అందించడం ద్వారా పోలియోను పారద్రోలామన్నారు. క్షయ రోగులు క్రమం తప్పకుండా 6 నెలలు మందులు వాడితే రోగం నయమవుతుందన్నారు. సీహెచ్‌సీ వైద్యురాలు ఎండీ నజిరిమ్ మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులు 6 నెలలపాటు ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే మందుల్ని తప్పనిసరిగా వాడాలన్నారు. పౌష్టికాహారం తీసుకుంటూ ఇతరులకు దూరంగా ఉండాలని సూచించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వీవీ.కృష్ణంరాజు, ఆదర్శ క్లబ్ అధ్యక్షుడు మోటుపల్లి శ్రీనివాసరావు, అభయ క్లబ్ అధ్యక్షుడు ఎండీ. జక్కీ, రీజియన్ చైర్మన్ దాట్ల రామరాజు, శ్రీనివాసరాజు, మోరా జ్యోతిరెడ్డి, పుప్పాల పండు, ముదునూరి నాగమణి, పల్లి అప్పిరెడ్డి, రంగారెడ్డి, షరీఫ్, అహ్మద్, వైద్యులు ప్రశాంత్, భాస్కరరావు, ఏఎన్ఎంలు, లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.



రోగులకు నిత్యవసర వస్తువులు, పౌష్టికాహారం, పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

సామాన్యులకు అర్థమయ్యేలా తిరుపతిశాస్త్రి రచనలు

ఉండి: సాహిత్యాన్ని సామాన్యుల చెంతకు చేర్చిన ఘనత దివాకర్ల తిరుపతి శాస్త్రికే దక్కుతుందని సాహితీ అభిమానులు, యండగండి కోఆపరేటివ్ రూరల్ బ్యాంక్ కార్యదర్శి సీహెచ్ రవికుమార్ అన్నారు. శనివారం తిరుపతి వేంకట కవి దివాకర్ల తిరుపతిశాస్త్రి 152వ జయంతిని పురస్కరించుకుని గ్రామంలోని గ్రంథాలయంలో ఉన్న ఆయన విగ్రహానికి గ్రామపెద్దలు, సాహిత్య అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సాహితీ చరిత్రలో తిక్కన్న, ఎల్లాప్రగడ, నన్నయ్య తరువాత అంతటి ఘనత సొందిన సాహితీ మూర్తులు తిరుపతి వెంకటకవులు అని అన్నారు. ఆయన నడయాడిన పల్లెగా యండగండి గ్రామం సాహితీ చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. తిరుపతిశాస్త్రి రచించిన పద్యాలు ఒకానొక సమయంలో పౌరాణిక నాటకాల్లో ఉర్రూతలూగించేవిగా ఉండేవని తెలిపారు. సామాన్యులకు సైతం అర్థమయ్యేలా తిరుపతిశాస్త్రి రచనలు ఉండేవని చెప్పారు. దీంతో సామాన్యులు కూడా ఆయన రచనల్లోని భావాలను అర్థం చేసుకుని ఎంతో ప్రేరణ పొందేవారని అన్నారు. అంతటి గొప్ప మహనీయులు యండగండి గ్రామంలో పుట్టడం తమ అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ వేగేశ్న సత్తిరాజు, చామర్తి అప్పారావు, టీ సూర్యచంద్రరావు, సీహెచ్ బంగార్రావు, సారధి తదితరులు పాల్గొన్నారు.



యండగండిలో దివాకర్ల తిరుపతి శాస్త్రి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామ పెద్దలు

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

ఉండి: ప్రజలకు ఆరోగ్యంతోపాటు అధిక దిగుబడులు అందించే ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి పెట్టాలని ఎన్నార్పీ అగ్రహారం కృషీ విజ్ఞానకేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్ మల్లిఖార్జునరావు అన్నారు. పెదపుల్లేరులో ప్రకృతి వ్యసాయంపై శనివారం రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లిఖార్జునరావు మాట్లాడుతూ రైతులు తమకు ఉన్న పొలంలోని కొంత భాగంలో తప్పనిసరిగా ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. రాష్ట్ర కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వై సూకరాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ఆచరించాల్సిన పద్ధతులను వివరించారు. మండల వ్యవసాయాధికారి బి.సంధ్య మాట్లాడుతూ భావితరాల వారికి పంటలు పండించేందుకు మేలు కరమైన మంచి నేలలు అందించాలంటే అది ప్రకృతి వ్యవసాయం వల్లనే సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా కోఆర్డినేటర్ అరుణ, శాస్త్రవేత్తలు డాక్టర్ పి.వినయలక్ష్మి, జీ రత్నాజీ తదితరులు పాల్గొన్నారు.



పెదపుల్లేరులో రైతులతో మాట్లాడుతున్న కేవీకే హెడ్ మల్లిఖార్జునరావు

అఖండ అన్నసమారాధన

ఆకివీడు: స్థానిక మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవం ముగింపు సందర్భంగా శనివారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ట్రస్టు చైర్మన్ గుర్రం హరినాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 2 వేల మందికి పైగా భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ జగ్గురోతు విజయ్‌కుమార్, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కుంకట్ల దానయ్య, సత్యనారాయణ, మోరా శ్రీనివాసరెడ్డి, పులవర్తి లక్ష్మణబాబు, రామకృష్ణ, ఆర్యవైశ్య ప్రతినిధులు గొంట్లా సత్యనారాయణ, గుర్రం శ్రీనివాస్, బొండాడ రాధాకృష్ణ, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఉండిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరాలి

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు

కాళ్ల: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరాలని, అందుకు పార్టీ శ్రేణులు నిరంతరం సైనికుల్లా పనిచేయాలని ఆ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు పిలుపునిచ్చారు. మండలంలోని బొండాడ గ్రామంలో పార్టీ నాయకులతో శనివారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో తాను ఓటమిపాలైనా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానని చెప్పారు. రానున్న ఎన్నికల్లో తప్పనిసరిగా తనను గెలిపించాలని కోరారు. కుల, మత, పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికింగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీల మేరకు పేదలకు సంక్షేమ పథకాలు అందజేయడంతోపాటు విద్య, వైద్య రంగాల్లో సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. అంతేకాకుండా మహిళల అభివృద్ధి కోసం అహర్నిశలు వైఎస్ జగన్ కృషి చేశారన్నారు. చంద్రబాబు అధికారం కోసం పొత్తులు పెట్టుకుని ప్రజలను మోసం చేసేందుకు కల్లబొల్లి హామీలు ఇస్తున్నాడని, ఆ మాటలు నమ్మవద్దని అన్నారు. ఇప్పటివరకు పేదల బ్యాంక్ ఖాతాల్లో సంక్షేమ లబ్ధి జమచేసేందుకు ఎన్నో మారులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కారని, వచ్చే ఎన్నికల్లో ఆయన మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేందుకు ప్రజలు రెండుమార్లు ఫ్యాన్ గుర్తుకు బటన్ నొక్కాలని పిలుపునిచ్చారు. ఉండి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెన్మెత్స విశ్వనాథరాజు, జెడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, జిల్లా సర్పంచుల ఛాంబర్ అధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు, ఉండి ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నే నాగరాజు, మాజీ ఎంపీపీ కందుల వెంకట మల్లికార్జునరావు, కోపల్లె సొసైటీ మాజీ అధ్యక్షుడు వేగేశ్న రవిరాజు, దంతులూరి కోటీశ్వర రాజు, మన్నే శ్రీనివాస్, మందపాటి రవి, పెన్మెత్స రంగరాజు, మన్నే సోమేశ్వరరావు, వేగేశ్న రాము, రామారావు, ముంజేటి రామకృష్ణ, ప్రసన్న కుమార్, కట్ట సుబ్బయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



బొండాడ గ్రామపెద్దలు, నాయకులతో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు

భగత్ సింగ్ జీవితం స్ఫూర్తిదాయకం

భీమవరం: దేశంకోసం ప్రాణాలర్పించిన వారంతా నిత్యం ప్రజల హృదయాల్లో సజీవంగా బతికే ఉంటారని అటువంటివారిలో భగత్‌సింగ్ ఒకరని దంతులూరి సత్యనారాయణరాజు అన్నారు. భీమవరంలో శనివారం భారత స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రఖ్యాత ఉద్యమకారుడు భగత్ సింగ్ వర్ధంతిని సర్వోదయ మండలి అధ్వర్యంలో క్విట్ ఇండియా స్థూపం వద్ద నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. న్యాయం కోసం, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడేవారందరికీ భగత్ సింగ్ జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రమణ్యం, ఎస్‌కే చాన్ భాషా, సీతారామరాజు, ఎం సత్యనారయణరాజు, బైరాజు సత్యనారయణరాజు తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ గొప్ప దేశభక్తుడు

భీమవరం: భారత జాతీయ ఉద్యమంలో పాల్గొని చిరుప్రాయంలోనే దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్ సింగ్ గొప్ప దేశభక్తుడని సీఐటీయూ పట్టణ కార్యదర్శి బి వాసుదేవరావు అన్నారు. శనివారం సర్దార్ భగత్ సింగ్ 93 వర్ధంతి సందర్భంగా భీమవరం సీఐటీయూ కార్యాలయం నుంచి కొవ్వొత్తు ర్యాలీ నిర్వహించి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ పౌర సమాఖ్య జిల్లా కన్వీనర్ వైకుంఠరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, ఇంజేటి శ్రీను, బంగారు వరలక్ష్మి, బంగారు పెద్దిరాజు, అప్పన్న ధనలక్ష్మి, అబద్ధం తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో క్విట్ ఇండియా స్థూపం వద్ద భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

వీహెచ్‌పీ కమిటీల ఏర్పాటు

ఉండి: స్థానిక శివాలయంలో ఆయా గ్రామాల విశ్వ హిందూ పరిషత్ కమిటీలను ఏర్పాటు చేశారు. వీహెచ్‌పీ మండల అధ్యక్షుడిగా పెన్మెత్స చిరంజీవి రాజు, కార్యదర్శిగా పరంసెట్టి ఆంజనేయులు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర మహిళా సంయోజక్ తొట్టెంపూడి సునీతదేవి మాట్లాడుతూ హిందూ సమాజ రక్షణ కోసం, మతమార్పిడులు అరికట్టేందుకు, భారతీయ సనాతన విలువలను భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రతి ఒక్క హిందూ పాటుపడాలని అన్నారు. ప్రతి ఒక్కరూ వీహెచ్‌పీలో చేరి హిందూ సమాజ పరిరక్షణకు పాటుపడాలని సూచించారు.

సైన్సు పరీక్షకు 705 మంది హాజరు

ఉండి: మండలంలో శనివారం నిర్వహించిన పదో తరగతి ఫిజిక్స్ పబ్లిక్ పరీక్షకు 705 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉండి ఏ, బీ సెంటర్లతో పాటు యండగండి, ఎన్నార్పీ అగ్రహారం, ఉప్పులూరు మొత్తం ఐదు పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 572 మంది, కంపార్ట్‌మెంటల్ విద్యార్థులు 133 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. కాగా ఈ పరీక్షకు మొత్తం 101 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు.

42 మంది గైర్హాజరు

ఆకివీడు: పదో తరగతి పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన ఫిజికల్ సైన్స్ పరీక్షకు మండలం నుంచి 789 మంది విద్యార్థులు హాజరుకాగా 42 మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ ఏ.రవీంద్ర చెప్పారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ ఆయా కేంద్రాల్ని సందర్శించారు.

వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

ఉండి: వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ఏపీడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు దుండి కృష్ణమోహన్ కోరారు. శనివారం భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పలువురు జర్నలిస్టులు తహసీల్దార్ కె.శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల సమస్యలను ఎన్నికల ప్రణాళికలో పెట్టి వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. మీడియా కమిషన్ ఏర్పాటు, జాతీయస్థాయిలో జర్నలిస్టు, మీడియా సంస్థలకు ప్రత్యేక చట్టం చేయడం, వర్కింగ్ జర్నలిస్టుల వేతన సవరణ కోసం వేజ్‌బోర్డు ఏర్పాటు వంటి తదితర కార్యక్రమాలను చేపట్టాలని డిమాండ్ చేశారు.